

# సబ్ జైల్ని తనిఖీ చేసిన శ్రీలక్ష్మి

**నరసాపురం అక్టోబర్ 14 ప్రభాతవార్త** ఉమ్మడి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్. శ్రీ లక్ష్మి ఈ రోజు మధ్యాహ్నం నర్సాపురం ఉప కారాగారాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ, నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్న వారికి అందించే వైద్య సదుపాయాలు , ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. జైల్ ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. ధనాశకు పోయి నేర చరిత్రను కలిగి ఉండడం కంటే ఉన్నదానితో సంతృప్తిగా కుటుంబ సభ్యులతో ఉంటడం మంచిదని, ప్రతి ఒక్కరు మంచి పరివర్తనతో బయటికి వెళ్లాలన్నారు. వంటశాలను, స్టోర్ రూమ్ , ఆహార పదార్దాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని జైల్ సిబ్బందిని ఆదేశించారు. జైలు ముద్దాయిలతో కుటుంబ సభ్యుల కమ్యూనికేషన్ జైలు సిబ్బంది కల్పిస్తున్నారా లేదా అని ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో ఉప కారాగారం పర్యవేక్షణాధికారి టి. అప్పారావు, జైల్ సిబ్బంది, ప్రిజన్ విజిటింగ్ ప్యానల్ లాయర్ , కె. చిట్టి పద్మజ, లీగల్ ఎయిడ్ కౌన్సెల్ కె . శిరీష జైలు సిబ్బంది పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త



## స్నేహపూర్వక వాతావరణంలో..

# ఎన్నికలు జరపాలి

### జిల్లా కలెక్టర్ నాగరాణి

**పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15, ప్రభాతవార్త**

ప్రజలు, రాజకీయ పార్టీల సహకారంతో స్నేహపూర్వక వాతావరణం లో ఎన్నికలు జరిపే విధంగా పనిచేయాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. జిల్లా ఎన్నికల పరిపాలన విభాగం ఆధ్వర్యంలో వశిష్ట సమావేశ మందిరంలోని ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు అనే అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ఎన్నికల షెడ్యూల్ విడుదలైన క్షణం నుంచే జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని స్పష్టం చేశారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ప్రచార సమయాల్లో, సభలు, ర్యాలీల నిర్వహణలో ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్తులపై రాతలు, ఫ్లెక్సీల ఏర్పాటు నిషిద్ధమని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా నగదు, మద్యం పంపిణీ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అభ్యర్థులందరూ ఎన్నికల సంఘం నిర్దేశించిన పరిమితికి లోబడే ఖర్చు చేయాలని, ఖర్చు వ్యయం నిబంధనలు మించకూడదని స్పష్టం చేశారు. పట్టణ స్థానిక సంస్థలు, జడ్పిటిసి, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం వేర్వేరు తేదీలను నిర్దేశించిందని కలెక్టర్ తెలిపారు. పట్టణ స్థానిక సంస్థల (మున్సిపల్) ఎన్నికల షెడ్యూల్: అక్టోబర్ 14న రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయగా, అక్టోబర్ 16న రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటీసులు జారీ చేయనున్నారు. నామినేషన్ల స్వీకరణకు అక్టోబర్ 18 చివరి తేదీ. అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 21న నామినేషన్ల ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటన ఉంటాయి. అక్టోబర్ 28న పోలింగ్, అవసరమైన చోట అక్టోబర్ 29న రీపోలింగ్ నిర్వహిస్తారు. అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్: అక్టోబర్ 19న రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్, అక్టోబర్ 21న రిటర్నింగ్ అధికారుల ఎన్నికల నోటీసులు వెలువడనున్నాయి. అక్టోబర్ 23 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అక్టోబర్ 24న పరిశీలన, అక్టోబర్ 25న తిరస్కరించిన నామినేషన్లపై అప్పీళ్ల స్వీకరణ, అక్టోబర్ 26న అప్పీళ్ల పరిష్కారం ఉంటాయి. అక్టోబర్ 27న నామినేషన్ల ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటన జరుగుతాయి. నవంబర్ 3న పోలింగ్, అవసరమైతే నవంబర్ 4న రీపోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటాయి. ఎన్నికల కోడ్ అమలును పర్యవేక్షించేందుకు జిల్లా వ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు నిరంతరం నిఘా ఉంచుతాయని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు గరిష్టంగా నాలుగు సార్లు (4 సెట్లు) నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉందని, కాబట్టి అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేసేటప్పుడు అన్ని వివరాలను జాగ్రత్తగా చూసుకొని పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థుల వాహనాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల దూరంలోనే నిలిపివేయాల్సి ఉంటుంది. ఆ పరిధి దాటి లోపలికి వాహనాలకు అనుమతి ఉండదని అన్నారు. రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించేందుకు వెళ్లే సమయంలో అభ్యర్థితో పాటు మరో ఇద్దరు వ్యక్తులకు మాత్రమే లోపలికి వెళ్లేందుకు అవకాశం కల్పిస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ మాట్లాడుతూ, ప్రచార సమయంలో ఒకే చోట రెండు వేర్వేరు పార్టీలు ప్రచారం చేయకుండా, వేర్వేరు ప్రాంతాలలో పోలీసు ముందస్తు అనుమతితో ప్రచారం నిర్వహించుకోవాలన్నారు. అప్పుడే ప్రశాంత వాతావరణంలో ప్రచారం కొనసాగుతుందని, లేదంటే అనవసర ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఏ ఒక్క ప్రభుత్వ అధికారి కూడా ఎన్నికల నియమాలను ఉల్లంఘించి ఏ ఒక్క పార్టీకి మద్దతుగా వ్యవహరించకూడదని, అంతా నిష్పక్షపాతంగా పనిచేయాలని ఆదేశించారు. ఎవరైనా అధికారి తమ పదవులను దుర్వినియోగం చేసినట్లు తేలితే వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పీ గ్లోరియా, జడ్పీ సీఈవో డి రమణ, జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారి వై దోసి రెడ్డి, ఎలక్షన్ సెక్షన్ ఇంచార్జ్ సూపరింటెండెంట్ హెచ్ ఎన్ సి శేఖర్, జిల్లా పంచాయతీ అధికారి పి విజయ భాస్కర్, వైఎస్సార్ సీపీ పార్టీ నుంచి డివిడి ప్రసాద్, టీడీపీ పార్టీ నుంచి యు చంద్రశేఖర్ , జనసేన పార్టీ నుంచి బి జై శివ, బీజేపీ పార్టీ నుంచి కె సురేంద్ర వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.





## కొలిక్కిరాని...

# కూటమి తగాదా!

- ఏలూరు, మేయర్ జంగారెడ్డిగూడెం మున్సిపల్ సీట్ల పై ప్రతిష్ఠంభన
- రెండు సీట్ల లో ఒక్కటైనా మాకి వాలని తెదేపా పట్టు..
- రోజంతా ఇరు వర్గాలనేతలు రహస్య సమావేశాలు
- ఎంపి పుట్టా వద్ద కు చేరిన పేచీ..

ఏలూరు ప్రభాతవార్త జిల్లా ప్రతినిధి

**ఏలూరు,కార్పొరేషన్ చైర్మన్ జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ చైర్ పర్సన్ స్థానాలు మాకంటే మాకని నాయకులు పట్టుదలకు పోవటం తో కూటమి లో కుంపటి రాజుకున్నట్టు కనిపిస్తోంది. మున్సిపల్ ఎన్నికలు సందర్బంగాజిల్లా కేంద్రం ఏలూరు చైర్మన్ పదవి కోసం ఎప్పటి నుండో జనసేన కన్నేసి ఉవ్విళ్ళు ఊరు తోంది. గ్రేడ్ 2మున్సిపాలిటీగా ఉన్న ఈ స్థానం కోసం కూడా జనసేన పావులు కదిపింది. ఈ క్రమం లో కూటమి లో గ్రూపు విభేదాలు ఒక్క సరిగా బయటపడ్డట్టు కనిపిస్తోంది.**




ఏలూరు జిల్లా లో ని ఒక కార్పొరేషన్ రెండు మున్సిపాలిటీలు మరో నగర్ పంచాయతీ కి సంబందించిన చైర్మన్ రిజర్వేషన్ పోస్ట్ ల ప్రకటన వెలువడిన నేపథ్యంలో కూటమి లో ఎవరికీ వారు తమ బలాన్ని నిలుపు కునే ప్రయత్నం జరిగింది. శుక్రవారం మధ్య హాన్నానికి గాని ఇవి కొలిక్కి వచ్చే పరిస్థితి లేదని విశ్వ స నీయసమాచారం. ఈ రెండు స్థానాలు గురించి పత్రికల్లో సమాచారం రాగా తెదేపా నేతలు ఉలిక్కిపడ్డారు. జంగారెడ్డిగూడెం గూడెం నుంచి పెద్ద సంఖ్య లో ముఖ్యనాయకులు జిల్లా, రాష్ట్ర ముఖ్యనేతలతో రోజంతా సమా లోచనలు చేశారని విశ్వస నీయసమాచారం. చింతలపూడి అసెంబ్లీ జనసేన సామనవ్య కర్త మేకా ఈశ్వరయ్య కూడా జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో తమ అభ్యర్థి పోటీ లో ఉంటారని స్పష్టంగా చెప్పారు. ఈ నేపథ్యంలో ఆయన ఇంటి వద్ద ముఖ్యనేతలప్రత్యేకంగా సమావేశం నిర్వహించడం జరిగింది. ఎవరూ ఆవేశపడొద్దని రాష్ట్ర నాయకుల ఆలోచన ప్రకారం నడుచు కుండా మని ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. సమావేశం లో మేకా ఈశ్వరయ్య, పోల్నా టి బాబీ, వల వల తాతాజీ, చింతలనాని, ఉమా, ఉక్కుర్తి సీతా రామ్ తదితరులు పాల్గొన్నారు.

**తెదేపా.. జనసేన మధ్య.. తప్పని విభేదాలు**

మేము కలిసే వున్నాం అని సీనియర్ నేతలు చెబుతున్నా కూటమి మధ్య కుంపటి అరలేదు. ఏలూరు కార్పొరేషన్ చైర్మన్ సీటు కై జనసేన సీనియర్ నాయకుడు ఆర్ టి సి రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు గట్టి పట్టు దల తో వున్నారు. ఒక దశలో ఆయన రాజీ నామా కు సైతం సిద్ద పడి నట్టు ప్రచారం జరిగింది. బిసి లకు కేటాయించి న ఈ స్థానం లో కూటమి ప్రతినిధి గా జనసేన అభ్యర్ధి అప్పలనాయుడు యాంప్ట్ అని అందరూ భావించారు. అనేక తర్జన బర్జన ల పిదప బుధవారం అర్ధ రాత్రి వరకూ జరిగిన సమాలోచనలు అనంతరం సమన్వయ కర్త తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బోలిశెట్టి శ్రీనివాస్ చేసిన ప్రకటన ఆశా జనకంగా జనసేన నేతలు భావించి హర్షం తెలిపారు. అలాగే ఏలూరు పార్లమెంట్ పరిశీలకు ల్లో ఒకరు మాజీ జెడ్ పి టిసి పోల్నాటి బాబ్జి తదితరులు ప్రముఖ ఏలూరు ప్రముఖ హోటల్లో అర్ధ రాత్రి వరకూ జరిగి న చర్చల్లో పాల్గొన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం జనసేన కు కేటాయించి నట్టు ప్రచారం జరిగింది. మొత్తం మీద రాష్ట్ర పరిధిలో జనసేన కు 5కార్పొరేషన్ స్థానాలు ఖరారు అయ్యా యని ఈ సందర్భంగా బాబ్జి" వార్త ప్రతినిధి" కి క్లారిటీ ఇచ్చారు. ఇటీవల వరకూ చాప కింద నీరులా అంతర్గతంగా వున్న అసంతృప్తి సెగలు చైర్మన్ అభ్యర్థి ప్రకటన నేపథ్యంలో ఒక్క సారిగా బయట పడ్డట్టుభావిస్తున్నారు.

**ఫ్లాష్.. ఫ్లాష్..**

**జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ ని తెలుగుదేశం పార్టీ కి కేటాయిస్తూ పార్టీ అధిష్టానం గురువారం రాత్రి 11గంటలకు జాబితా విడుదల చేసింది.**

# ఆదర్శమున్సిపాలిటీగా నూజివీడు..

### రూ 155 కోట్లతో మున్సిపాలిటీ రూపురేఖలు మార్చనున్నాం

### రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి...

ఏలూరు /నూజివీడు, అక్టోబరు 15: ప్రభాత వార్త ప్రతినిధి



నూజివీడు పట్టణంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించే దిశగా మొత్తం 79.71 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, కొన్ని పనులు పూర్తిఅయ్యాయని, కొన్ని పనులు ఇంకా జరుగు తున్నాయని మొత్తం 70 శాతం పనులు పూర్తి అయ్యాయని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్ధసారధి తెలిపారు. నవంబరు నెలలో మొత్తం అభివృద్ధి పనులు పూర్తిచేసి, ప్రజలు వాడుకలోకి తీసుకు వస్తామని అన్నారు. రూ 155 కోట్లతో మున్సిపాలిటీ రూపురేఖలు మార్చే అభివృద్ధి పనులకు ప్రపోజల్స్ పంపించడం జరిగిందని, నిధులు మంజూరు కాగానే నూజివీడు ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుటకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామని తెలిపారు. రూ 137.00 కోట్లు అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పరిపాలనా అనుమతులు ఆమోదం పొందాల్సి ఉంది మర్రిబంధం పోలవరం కాలువ నుంచి నీటిని తరలించేందుకు సమ్మరు స్టోరేజీ ట్యాంకు పైప్‌లైను నూజివీడు పట్టణంలోనీ పెద్దచెరువు దగ్గర నిర్మాణం, రూ 18.00 కోట్లతో నూజివీడు మున్సిపాలిటీలో సీసీ డ్రైన్ల నిర్మాణంకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని అన్నివర్గాలు ప్రజలు ఆశీర్వదించి, కూటమి పార్టీ అభ్యర్థులను గెలిపించి మంచిమెజార్టీ ఇవ్వాలని కోరారు. నూజివీడు అభివృద్ధే లక్ష్యంగా ప్రతి వార్డులో ప్రజలు అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తున్నామని అన్నారు. మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ, పార్కులు,స్మశానవాటికలు, కమ్యూనిటీ హాళ్లు, పారిశుద్ధ్యం, ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ ముందుకుసాగుతున్నామని అన్నారు. ప్రతి వార్డులో ప్రజలు అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు, ప్రతి ఇంటికీ మంచినీరు,మెరుగైన రోడ్లు, డ్రైనేజీలు, అందమైన పార్కులు, మెరుగైన పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. సామాజిక వర్గాలకు అవసరమైన సదుపాయాలు, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నూజివీడును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళుతున్నామని, మన మందరం కలిసికట్టుగా పనిచేసి రాష్ట్రంలోనే ఆదర్శమున్సిపాలిటీగా తీర్చిదిద్దుకుందామని మంత్రి కొలుసు పార్థసారధి పిలుపునిచ్చారు.

# ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదు

### అధికారులకు జెసి కల్పశ్రీ దిశా నిర్దేశం

**పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15, ప్రభాతవార్త** ఎన్నికల విధులు నిర్వహించడంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ సూచించారు. స్థానిక జిల్లా కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ మందిరంలో సోమవారం నరసాపురం మున్సిపల్ ఎలక్షన్ కు చెందిన అధికారులతో ఎన్నికల నియమావళి అమలుపై సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలి అని జెసి సూచించారు. ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది తమ బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి, సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ ఆదేశించారు. గురువారం భీమవరం కలెక్టరేట్లోని పి.జి.ఆర్.ఎస్. సమావేశ మందిరంలో ఎన్నికల అధికారులు అదనపు ఎన్నికల అధికారులు సహాయ ఎన్నికల అధికారులు ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు నరసాపురం మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబ ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో అర్థం చేసుకొని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా



విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి దశ కీలకమైనదని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి నిర్దేశించిన విధివిధానాలు, అభ్యర్థులు సమర్పించాల్సిన పత్రాలు, సంబంధిత రికార్డుల నిర్వహణపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు

# కూటమి శ్రేణులు సిద్ధం కావాలి

### పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుంది

### తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి



**తణుకు, అక్టోబర్ 15( ప్రభాత వార్త )**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కూటమి శ్రేణులందరు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు కూటమి నాయకులు, కార్యకర్తలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి, ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో పోటీ చేయాలని ఆశిస్తున్న నాయకులు, ఆయా స్థానాలకు ఖరారు చేసే రిజర్వేషన్లకు అనుగుణంగా ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని తెలిపారు. కూటమి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, గ్రామాల్లో పార్టీకి ప్రజాదరణ పెరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో సమష్టి నిర్ణయాలు, పరస్పర సహకారం ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఆశిస్తున్న ప్రతి ఒక్కరికీ అవకాశం లభించకపోవచ్చని, అలాంటి వారు ఎవరూ అధైర్యపడవద్దని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సూచించించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తల సేవలను పార్టీ అధిష్టానం గుర్తిస్తుందని భరోసా ఇచ్చారు. పదవులే లక్ష్యంగా కాకుండా పార్టీ అభివృద్ధి, ప్రజాసేవను ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కూటమిలోని భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థి ఎంపికపై

# తెదేపా గరం గరం...

- మూకుమ్మడి రాజీనామాలకు నిర్ణయం
- ఎమ్మెల్యే చంటికి అవమానాలు..
- మీడియా సమావేశం లోసీనియర్ నేతలు

ఏలూరు ప్రభాతవార్త ప్రతినిధి



ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ స్థానం జనసేన కు కేటాయించటం పట్ల మనస్థాపం చెంది తాము మూకుమ్మ డిగా తెలుగు దేశం పార్టీ కి రాజీనామా చేస్తున్నామని నగర పార్టీ నాయకులు ప్రకటించి కల కలం సృష్టించారు. ఏలూరు లో గురువారం రాత్రి పది గంటల ప్రాంతం లో నిర్వహించిన మీడియా సమావేశం లో పలువురు ముఖ్యనాయకులు పాల్గొన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఈ విషయం లో నిస్సహాయం తో కన్నీటి పర్యంత మాయ్యారని మీడియా సమావేశం లో నాయకులు ఆవేదన చెందారు. ఏలూరు అభ్యర్థి కి రికార్డు స్థాయిలో 63వేల ఓట్ల మెజారిటీ ఇచ్చిన తాము ఇపుడు అడ్రస్ లేని రీతిలో తెలుగుదేశం పార్టీ అధిష్టానం చేసిన మోసం తో దిక్కు తోచని రీతిలో రాజీ నామా చేయాలని నిర్ణయం తీసుకొని మీడియా ముందుకు వచ్చామన్నారు. వాసు మాట్లాడు తూ ఎమ్మెల్యే గా బడేటి చంటి రాష్ట్ర స్థాయి లో ఆరో స్థానంలో ఉన్నా మని ముఖ్య మంత్రి ప్రశంస లు పొందిన ఎమ్మెల్యే ఈ రోజు ఇంటి నుండి బయట కు రాలేని పరిస్థితి కి తెచ్చి న ఘనత పార్టీ దని దుయ్య బట్టారు. మరో రెండు మూడు రోజులు టైమ్ వుంది కనుక అధిష్టానం ఏలూరు మెయర్ టికెట్ మార్చక పొతే రేపటి నుంచే రాజీ నామాల పరం పర మొదలవు తుంది అని ఎస్ ఎమ్ ఆర్ పెదబాబు తదితరులు తీవ్రంగా హెచ్చరిక చేశారు. సమావేశం లో చోడే వెంకట రత్నం, కంప్యూటర్ ప్రసాద్,రెడ్డి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటించాలి

### ఎన్నికల ఏర్పాట్ల జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి సమీక్ష

ఏలూరు ప్రభాత వార్త జిల్లా ప్రతి నిధి



ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశపు హాలులో గురువారం సాయంత్రం నగరపాలక, పురపాలక సంఘాల ఎన్నికల ఏర్పాట్లపై ఏలూరు నగరపాలక సంస్థ సిబ్బంది, జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి పురపాలక సంఘాల అధికార్లతో జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుండి ఏలూరు నగరపాలక సంస్థ, జిల్లాలోని పురపాలక సంఘాల ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న దృష్ట్యా నామినేషన్ ప్రక్రియ నుండి కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యే వరకు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు, సిబ్బంది పనిచేయాలన్నారు. అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని, నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల వరకు మాత్రమే వాహనాలు అనుమతి ఉంటుందని, అభ్యర్థితోపాటు నిర్దేశించిన వ్యక్తులను మాత్రమే నామినేషన్ హాలులోకి అనుమతించాలన్నారు. ఒకేసారి ఎక్కువమంది నామినేషన్ వేసేందుకు వచ్చిన పక్షంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన నిర్వహణా చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులకు కేటాయించిన గుర్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, నిబంధనల మేరకు ఉన్నవాటిని మాత్రమే అనుమతించాలన్న. బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసుకోవాలని, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలపై సంబంధిత సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ అందించాలన్నారు. అభ్యర్థుల ఎన్నికల కోసం చేసే ప్రచార, ప్రకటన ఖర్చులను పరిశీలించేందుకు స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలను, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి ఉల్లంఘనలు పరిశీలించేందుకు ఎంసీసీ బృందాలను ఏర్పాటుచేయాలన్నారు. నామినేషన్, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటుచేయాలని, ఆయా ప్రక్రియలను వీడియో కవరేజ్ చేయించాలన్నారు. జిల్లాలోని నగరపాలక, పురపాలక సంఘాల కార్యాలయాలలో ఎన్నికల సమాచారం, ఫిర్యాదులు నమోదు, తదితరాలకు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్ మాట్లాడుతూ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. నామినేషన్, పోలింగ్, కౌంటింగ్ సమయాలలో ఆయా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎన్నికల నియమ నిబంధలను ఎన్నికల సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని విధులు నిర్వర్తించాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ సిహెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ . భానుప్రతాప్, డిఎస్పీ శ్రావణ్ కుమార్, ఏలూరు నగరపాలక సిబ్బంది, ప్రభృతులు పాల్గొన్నారు. అనంతరం ఏలూరు నగరపాలక సంస్థలోని నామినేషన్ స్వీకరణ కేంద్రాలలోని ఏర్పాట్లను ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్ తో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి పరిశీలించారు. నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి పురపాలక సంఘాలకు చెందిన అధికారులు, ఎన్నికల సిబ్బంది, పోలీసు, ఇతర శాఖల అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

## లలితా త్రిపుర సుందరిగా అమ్మవారు



**అత్తిలి, అక్టోబర్ 15( ప్రభాతవార్త )**అత్తిలి కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా భవాని భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల త్రిమూర్తులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.అత్తిలి గ్రామంలోని విజయ చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా లలితా త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అత్తిలి రామన్నపేటలో కల ఐశ్వర్య దుర్గ అమ్మవారి ఆలయంలో కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## రూ 4 కోట్లతో వాసవీ మాతకు మహాలక్ష్మి అలంకరణ



**భీమవరం అక్టోబర్ 15 ప్రభాతవార్త** భీమవరం త్యాగరాజ భవనంలో శ్రీవాసవీ కన్యక పరమేశ్వరి దేవిని దసరా ఉత్సవాల్లో భాగంగా మహాలక్ష్మి దేవిగా అలంకరించారు. ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి ధనలక్ష్మి అలంకరణ చేశారు.. అమ్మవారిని రూ 500, 200, 100, 50, 20, 10 కరెన్సీ నోట్లతో కోట్లాది రూపాయల విలువైన ధనంతో అలంకరించారు. బంగారం, వెండి ఆభరణాలను కూడా అలంకరణకు ఉపయోగించారు. త్యాగరాజ భవనాన్ని సైతం కరెన్సీ నోట్ల దండలతో అలంకరించారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మండ విజయ్ భాస్కర్ , పుసారపు సుబ్బారావు, కోశాధికారి కేశవారపు రాజశేఖర్, మందిర చైర్మన్ వబిలిశెట్టి ప్రసాదరావు, తటవర్తి బదిరి నారాయణ మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.58,116 విరాళం

### సీతంపేటలో ద్వారబంధ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న గడ్డమణుగు రవికుమార్



**కొయ్యలగూడెం, అక్టోబర్ 15 ప్రభాత వార్త** కొయ్యలగూడెం మండలం సీతంపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రాజరాజేశ్వరి త్రిశక్తి పీఠం దేవాలయ నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ, జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ద్వారకాతిరుమల శ్రీ చిన్న వెంకన్న దేవస్థానం స్టేట్ ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు గడ్డమణుగు రవికుమార్ రూ.58,116 విరాళాన్ని అందజేశారు. అమ్మవారిపై తనకున్న భక్తిని చాటుకుంటూ ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించారు. శుక్రవారం సీతంపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని సందర్శించిన రవికుమార్, అక్కడ నిర్వహించిన ద్వారబంధ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ యర్రమిల్లి మనోజ్ శర్మ ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న ఈ ఆలయ ద్వారబంధ మహోత్సవంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ఈ సందర్భంగా రవికుమార్ తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం, ఆలయాల నిర్మాణానికి తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. శ్రీనివాస్ రెడ్డి, పసుమర్తి సతీష్, దాకారపు మధు తదితరులు పాల్గొన్నారు.

## 16న కాళ్ల శివాత్మానంద ఆశ్రమంలో లలిత మహా యజ్ఞం



**కాళ్ల అక్టోబర్ 15 (ప్రభాతవార్త)** మండల కేంద్రమైన కాళ్ల శివాత్మానంద ఆశ్రమంలో శుక్రవారం లలిత మహా యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. శివాత్మానందాశ్రమంలో శ్రీ కాలభైరవ నవగ్రహ సహిత మరకత శ్రీ చక్రస్తిత శక్తి స్వరూపిణి శ్రీ రాజరాజేశ్వరి దేవి శరన్నవరాత్ర 73వ వార్షిక మహోత్సవాలలో భాగంగా ఈ హోమంలో పాల్గొనే భక్తులు నవధాన్యాలు, ఆవు నెయ్యి, రెండు కొబ్బరికాయలు తెచ్చుకొని హోమంలో పాల్గొ వచ్చని హోమంలో పాల్గొన్నవారు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదని తెలిపారు. భక్తులు సమర్పించిన 60 కేజీల లడ్డుకు శుక్రవారం మూడు గంటలకు వేలం పాట నిర్వహిస్తామన్నారు. శక్తి క్షేత్రానికి రక్షణగా శక్తి ఆరాధనలో అనుబంధంగా శ్రీ కాలభైరవార్చన, నవగ్రహ శాంతి పూజలు, అమ్మవారికి శక్తి హోమాలు, అరుదైన మరకత బాన లింగం, మరకత శ్రీ చక్ర మహా మెరువుకు, 358 శ్రీ చక్ర మహామేరువులకు అభిషేకాలు, సహస్ర కుంకుమార్చనలు భక్తులే స్వయంగా చేసుకునే ఏర్పాటు నిర్వాహకులు చేశారు.

## ఎన్నికల నిబంధనలు పాటించాలి,

ప్రత్యేక అధికారి సాయిబుచ్చారావు



**జీలుగుమిల్లి, అక్టోబర్ 15, ప్రభాతవార్త** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాజకీయ పార్టీలు, ప్రజలు కచ్చితంగా పాటించాలని మండల ప్రత్యేక అధికారి ఎం సాయిబుచ్చారావు అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో ఉన్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలని అన్నారు. అదేవిధంగా రానున్న ఎన్నికలలో ప్రతి ఓటరు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఎవరైనా అతిక్రమిస్తే అందుకు అనుగుణంగా చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వెంకటేశ్వరరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి కే వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లు ఖరారు తో కొందరిలో ఉత్సాహం మరికొందరిలో నిరుత్సాహం



**ప్రభాతవార్త చాట్రాయి** రిజర్వేషన్లు ఖరారు కావడంతో చాట్రాయి మండలంలో కొందరిలో ఉత్సాహం ఉండగా మరికొందరు నిరుత్సాహంలో పడ్డారు. మండల పరిషత్ అధ్యక్షరాలు పదవి ఓసి మహిళలకు కేటాయించటంతో కూటమిలో ఉన్న కొందరు నాయకులకు మింగుడు పడటం లేదు. ఎంపీపీ ఓసీ జనరల్ లకు కేటాయిస్తారని ఎదురుచూసిన వారికి భంగ పాటు తప్పలేదు. రిజర్వేషన్లు చాలామంది నాయకుల తలరాతలు మార్చినట్లు అయిందని పలువురు భావిస్తున్నారు. మండల స్థాయిలో ఇప్పటివరకు చక్రం తిప్పిన నాయకులకు రిజర్వేషన్లు బెడద తలనొప్పిగా మారింది. ఇక జడ్పిటిసి విషయానికి వస్తే ఎస్సీ జనరల్ లకు కేటాయించడంతో ఆ అవకాశం కూడా లేకుండా పోయింది. దీంతో మండలంలో కొన్ని గ్రామాల నాయకులు నిరుత్సాహంలో ఉన్నారు. ఇక సర్పంచుల విషయానికొస్తే సర్పంచిగా చక్రం తిప్పుదామని ఆశించిన వారికి కథ అడ్డం తిరిగింది. సుమారు ఆరేళ్ల నుండి సర్పంచి వద్దామని ఎంతో ఆశతో ఉండగా ఎస్సీలకు బీసీలకు మహిళలకు కేటాయించడంతో అగ్రవర్ణాల సామాజిక వర్గానికి దెబ్బ తగిలినట్టు అయింది. అయితే తెలుగుదేశం పార్టీలో గ్రూపులు అధికంగా ఉండగా వారందరిని ఒక తాటిపై నడిపేందుకు మంత్రి కొలుసు పార్థసారథి రంగంలోకి దిగారు. గ్రూపుల వల్ల సర్పంచ్ గాని ఎంపీటీసీ గాని ఓడిపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. దీనితో గ్రామాలలో నాయకుల సమన్వయ కోసం నియోజకవర్గ స్థాయిలో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు పనిచేస్తున్నారు తెలుసుకొని మంత్రికి ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చేందుకు ఈ కమిటీ ఒక కంట కనిపెడుతుందని తెలుస్తోంది. ఇక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే మండలంలో ఐదు ఆరు గ్రామపంచాయతీలలో పార్టీ బలంగా ఉండగా ఎక్కువ పంచాయతీలను కైవసం చేసుకునేందుకు వ్యూహాలు పన్నుతున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా గట్టి పోటీ ఇచ్చేందుకు వరంగల్ సిద్ధమవుతోంది. మండల పరిషత్ ఇటీవల కాలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటూ వస్తుండగా జడ్పిటిసి మాత్రం ఒక్కసారి కూడా తెలుగుదేశం పార్టీ గెలిచిన దాఖలాలు లేవు. అయితే ఈసారి మంత్రి పార్థసారథి దీనిపై ప్రత్యేక దృష్టి సారించి విజయం సాధించాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఏదేమైనా మండలంలో కూటమి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీల మధ్య పోరా హోరి పోరు జరిగే అవకాశాలు కనబడుతున్నాయి.

## నూజివీడు నియోజకవర్గంలో

# ఎంపీటీసీల రిజర్వేషన్లు ఖరారు

**నూజివీడు, అక్టోబరు15 ప్రభాతవార్త:** ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసింది. నియోజకవర్గంలోని 4 మండలాలకు సం బంధించిన ఎంపీటీసీల రిజర్వేషనన్ను సైతం అధికారులు సిద్ధం చేశారు. 4 మండలాల్లోని ఎంపీటీసీల రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి. నూజివీడు మండలంలో ఎస్టీ జనరల్కు యనమదల, ఎస్సీ మహిళకు సుంకొల్లు, పల్లెర్లమూడి, హనుమంతులగూడెం, ఎస్సీ జనరల్కు పోతురెడ్డిపల్లి, తుక్కులూరు, పాతరావిచర్ల, బీసీ మహిళకు దిగవల్లి, ముక్కొల్లుపాడు, బీసీ జనరల్కు గొల్లపల్లి-1, జనరల్ మహిళకు గొల్లపల్లి-2, దేవరగుంట, అన్నవరం, తూర్పు దిగవల్లి, పోలసానపల్లి, జనరల్కు బోర్వంచ, మీర్జా పురం, ఎంఎస్పీలెం, మర్రిబంధం, వెంకటాయ పాలెంలను కేటాయించారు.

**ఆగిరిపల్లి మండలంలో..**

ఎస్సీ మహిళకు నెక్కలం గొల్లగూడెం, కృష్ణవరం, ఎస్సీ జనరలు సింహాద్రి అప్పారావుపేట, నూగొండపల్లి, ఈదులగూడెం, బీసీ మహిళకు చొప్పరమెట్ల, వడ్లమాను, బీసీ జనరల్ కు బొద్దనపల్లి, ఆగిరిపల్లి-1, జనరల్ మహిళకు ఈదర-2, ఆగి రిపల్లి-2, చిన్నాగిరిపల్లి, సూరవరం, వట్టిగు డిపాడు, జనరల్ కు కొత్త ఈదర, ఈదర-1, కన సానపల్లి, నరసింగపాలెంలను కేటాయించారు.

**ముసునూరు మండలంలో...**

ఎస్సీ మహిళకు రమణక్కపేట, కొర్లగుంట, ఎస్సీ జనరలు గుళ్లపూడి, కాట్రేనిపాడు-1, కాట్రేనిపాడు-2, బీసీ మహిళకు లోపూడి, చింతలవల్లి, బీసీ జనరల్ కు చెక్కపల్లి-2, జనరల్ మహిళకు అక్కిరెడ్డి గూడెం, వేల్పుచర్ల, ముసునూరు-2, గోపవరం-1, జనరల్ కు వలసపల్లి, ముసునూరు-1, గోపవరం -2, చెక్కపల్లి-1లను కేటాయించారు.

**చాట్రాయి మండలంలో..**

ఎస్టీ జనరలు చీపురుగూడెం, ఎస్సీ మహిళకు కృష్ణారావుపాలెం, నరసింహారావుపాలెం, ఎస్సీ జనరల్కు జనార్దనవరం, చిన్నంపేట, బీసీ మహిళకు బూరుగగూడెం, బీసీ జనరల్ కు కోటపాడు, జనరల్ మహిళకు చిత్తపూరు, కొత్తగూడెం, తుమ్మగూడెం, పోలవరం, జనరల్కు మర్లపాలెం, చాట్రాయి, చనుబండ, పోతనపల్లిలను కేటాయించారు.

## నూజివీడు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి రేసులో బత్తుల లక్ష్మీ బాల కోటేశ్వరి



**నూజివీడు అక్టోబర్ 15 ప్రభాతవార్త:** నూజివీడు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థుల ఎంపికపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్న నేపథ్యంలో, విశ్రాంత డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ (డీసీటీవో) బత్తుల లక్ష్మీ బాల కోటేశ్వరి పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. సుదీర్ఘకాలంగా సామాజిక, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజల్లో గుర్తింపు పొందిన ఆమెను చైర్మన్ అభ్యర్థిగా బరిలోకి దింపితే అన్ని వర్గాల మద్దతు లభించే అవకాశాలున్నాయనే అభిప్రాయాలు పట్టణంలో వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ చైర్మన్ పదవి ఎస్సీ జనరల్‌కు కేటాయించిన నేపథ్యంలో, సామాజిక సేవలో తనదైన ముద్ర వేసుకున్న లక్ష్మీ బాల కోటేశ్వరి అభ్యర్థిత్వంపై ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన కొందరు నాయకులు తమ పార్టీ తరఫున చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేయాలని ఆమెను కోరినట్లు పట్టణంలో ప్రచారం జరుగుతోంది. అయితే, దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

**పేద విద్యార్థులకు అండగా సేవా కార్యక్రమాలు**

బత్తుల లక్ష్మీ బాల కోటేశ్వరి ఉద్యోగ విరమణ అనంతరం కూడా సామాజిక సేవను కొనసాగిస్తున్నారు. సుమమాల సంస్థ ద్వారా పేద విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, పుస్తకాలు అందిస్తూ వారి విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నారు. నూజివీడులో వరుసగా రెండేళ్లపాటు బాలోత్సవాలను నిర్వహించి చిన్నారుల్లో సృజనాత్మకతను, సాంస్కృతిక ఆసక్తిని ప్రోత్సహించేందుకు కృషి చేశారు. తన మాతృమూర్తి బత్తుల వీరమ్మ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న చారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రతి ఉగాది పర్వదినాన సాహిత్య సేవా పురస్కారాలను అందించడంతోపాటు నగదు బహుమతులు ప్రదానం చేస్తున్నారు. సాహిత్య రంగానికి సేవలందిస్తున్న వారిని ప్రోత్సహిస్తూ తన తల్లి ఆశయాలను కొనసాగిస్తున్నారు.

**మానవతా సంస్థ ద్వారా సేవలు**

స్వచ్ఛంద సేవా సంస్థ అయిన మానవతాలోనూ భాగస్వామిగా ఉంటూ అవసరంలో ఉన్నవారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ, సేవా కార్యక్రమాల ద్వారా సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారు. ఇదిలా ఉండగా, శ్రీశైలంలోని హిందూ మాల సత్రం అధ్యక్షురాలిగా బత్తుల లక్ష్మీ బాల కోటేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ బాధ్యతలను చేపట్టిన అనంతరం సత్రం అభివృద్ధికి కృషి చేయడంతోపాటు అక్కడికి వచ్చే వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఆమెకు సన్నిహితంగా ఉన్నవారు పేర్కొంటున్నారు.

**చైర్మన్ అభ్యర్థిత్వంపై ఆసక్తికర చర్చ**

వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉన్న లక్ష్మీ బాల కోటేశ్వరి పేరు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా చర్చకు రావడం పట్టణ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆమెకు అభ్యర్థిగా అవకాశం కల్పిస్తే పార్టీ రాజకీయాలకు అతీతంగా వివిధ వర్గాల ప్రజల మద్దతు లభించవచ్చని కొందరు పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ప్రధాన పార్టీల నుంచి ఆమెకు ఆహ్వానాలు అందాయన్న ప్రచారం, చైర్మన్ అభ్యర్థిగా ఆమె పోటీ చేసే అవకాశాలు ఇంకా అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. రానున్న రోజుల్లో రాజకీయ పరిణామాలు ఏ విధంగా మారుతాయో, బత్తుల లక్ష్మీ బాల కోటేశ్వరి అభ్యర్థిత్వంపై ఎలాంటి నిర్ణయం వెలువడుతుందో వేచి చూడాలి.

## రీ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ



**భీమవరం అక్టోబర్ 15 ప్రభాతవార్త** జిల్లాలోని 45 గ్రామాల్లో వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న రీ సర్వే పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం భీమవరం కలెక్టరేట్‌లోని ఆమె ఛాంబర్ నుంచి భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారులతో రీ సర్వే పురోగతిపై ఆమె వర్చువల్ గా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న రీ సర్వే పనుల వివరాలను సమీక్షించి, పనుల పురోగతిపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 45 గ్రామాల్లో రీ సర్వే పనులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిలో నరసాపురం డివిజన్‌లో 23 గ్రామాలు, భీమవరం డివిజన్‌లో 14 గ్రామాలు, తాడేపల్లిగూడెం డివిజన్‌లో 8 గ్రామాలు ఉన్నాయని వివరించారు. ఆయా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యత క్రమంలో వేగవంతం చేసి, రీ సర్వే ప్రక్రియతో పాటు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను మార్చి 2027 నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నరసాపురం మండలంలో ఆరు గ్రామాలు, గణపవరం మండలంలో ఐదు గ్రామాల్లో రీ సర్వే పనులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రీ సర్వే పనుల నిర్వహణలో క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది కొరత ఉన్న ప్రాంతాల్లో ఆ వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి, పనులకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి, రీ సర్వే పనుల పురోగతిని సమీక్షించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించుకోవాలని, నిర్దేశించిన గడువులోగా లక్ష్యాలను సాధించేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సర్వే అధికారి జాషువా, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ శేఖర్, సర్వే శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## జయీ భవ .. విజయీ భవ .. ద్విజయీ భవ .. అంటూ దసరా శోభాయాత్ర



**భీమవరం అక్టోబర్ 15 ప్రభాతవార్త** జయీ భవ .. విజయీ భవ .. ద్విజయీ భవ .. లోకసమ్మాస్తా సుఖినోభవన్తు నినాదాలతో దసరా పద్యాలతో విజయీ భవ యాత్ర శోభాయమానంగా సాగింది. భీమవరం విశ్వశాంతి వృద్ధాశ్రమం రోడ్డు నుంచి శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దసరా విజయీభవ శోభాయాత్ర నిర్వహించారు. ఆశ్రమం అధ్యక్షులు భూపతిరాజు సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఇటువంటి సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లుగా భారతదేశం బాసిల్లుతొందని, దుష్ట శిక్షణ శిష్ట శిక్షణ చేసి లోకాశాంతిగా ఉండాలని పిల్లలు పెద్దలు దసరా సంబరాలు నిర్వహిస్తారని అన్నారు. అమ్మవారిని ఎంతో నిష్టగా కొలిచే పండుగ దసర పండుగ అని అన్నారు. కార్యక్రమ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల వారికి విజయం చేకూరాలని దసరా విజయిభవ శోభాయాత్ర అన్ని దేవాలయాల నుంచి నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గొట్టుముక్కల హరి, గొట్టుముక్కల కృష్ణంరాజు, కనకదుర్గమ్మ, సత్యవతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ స్వాగతం పలికిన కొవ్వలి నాయుడు



**నరసాపురం: అక్టోబర్ 14 ప్రభాతవార్త** పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం పార్లమెంట్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణని నరసాపురం పట్టణంలోని సన్‌రైజ్ హోటల్ నందు కొవ్వలి నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు. ?అనంతరం ఇరువురు నేతలు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని స్థానిక మున్సిపల్ ఎన్నికల సన్నద్ధత, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ తదితర రాజకీయ అంశాలపై వారు విస్తృతంగా చర్చించారు.

## భీమవరం ఎంపీపీ పదవికి కూటమి తరఫున బస్వాని.లక్ష్మీనరసమ్మకు అవకాశం కల్పించాలి

### మాజీ సర్పంచ్ బస్వానీ చంద్రరావు వినతి



**కోతపూసలమర్రు, అక్టోబరు 15 ప్రభాతవార్త** భీమవరం మండల పరిషత్ అధ్యక్ష పదవికి కూటమి తరఫున కొత్తపూసలమర్రు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బస్వానీ చంద్రరావు భార్య బస్వానీ లక్ష్మీనరసమ్మకు అవకాశం కల్పించాలని కోరుతూ గురువారం టీడీపీ కార్యాలయంలో మాజీ ఎంపీ, నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. భీమవరం మండల పరిషత్ అధ్యక్ష పదవి బీసీ మహిళకు రిజర్వు కావడంతో లక్ష్మీనరసమ్మకు అవకాశం కల్పించాలని కోరారు. బస్వానీ చంద్రరావు టీడీపీలో గ్రామ అధ్యక్షుడిగా, సీనియర్ నాయకుడిగా పార్టీకి సేవలందిస్తున్నారు. కొత్తపూసలమర్రు గ్రామ సర్పంచ్‌గా 2013 నుంచి 2018 వరకు పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేశారు. గ్రామంలో పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన సేవలను గుర్తించి నిర్మల పుష్కర గ్రహీత అవార్డు అందజేశారు. కూటమి తరఫున భీమవరం మండల పరిషత్ అధ్యక్ష పదవికి బ బస్వాని.లక్ష్మీనరసమ్మకు అవకాశం కల్పిస్తే మండలంలోని 21 గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని బస్వానీ చంద్రరావు తెలిపారు.

## డాక్టర్ బి.వి.రాజు జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు

### విద్యార్థులకు రూ.85 వేల మెరిట్ స్కాలర్‌షిప్‌లు



**భీమవరం, అక్టోబర్ 15 ప్రభాతవార్త** శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, డాక్టర్ బి.వి.రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ బి.వి.రాజు 106వ జయంతిని పురస్కరించుకుని గురువారం భీమవరం, పరిసర ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బి.వి.రాజు సమాధి వద్ద శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, డాక్టర్ బి.వి.రాజు ఫౌండేషన్‌కు చెందిన వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ బి.వి.రాజు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు డాక్టర్ బి.వి.రాజును ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ప్రతిభ కనబరిచిన 20 మంది పాఠశాల విద్యార్థులకు రూ.85 వేల నగదును మెరిట్ స్కాలర్‌షిప్‌లుగా అందజేశారు.

**కుష్ఠు వ్యాధిగ్రస్తులకు నిత్యావసరాలు, మందుల పంపిణీ**

సేవా కార్యక్రమాల్లో భాగంగా ఫాదర్ ఎఫ్.ఎం.ఎల్.ఆర్. కేంద్రంలో 100 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులకు బియ్యం, యాపిల్స్, బిస్కెట్లు, బ్రెడ్, బన్స్ పంపిణీ చేశారు. అదే కేంద్రంలోని శృంగవృక్షం ప్రాంతంలో రోగుల మందుల ఖర్చుల నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సెయింట్ మేరీస్ కుష్ఠు వ్యాధిగ్రస్తుల కేంద్రంలో రోగులకు మందుల కొనుగోలు నిమిత్తం రూ.90 వేల చెక్కును అందించారు. అక్కడ మరో 100 మందికి యాపిల్స్, బిస్కెట్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం సెయింట్ మేరీస్ కేంద్రంలో 180 మందికి యాపిల్స్, బిస్కెట్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. భీమవరం ఏడో వార్డులోని కుష్ఠు వ్యాధిగ్రస్తుల కాలనీలో 112 మందికి పింఛన్లు, బియ్యం పంపిణీ చేశారు. అదనంగా వెయ్యి మందికి యాపిల్స్, బిస్కెట్లు, బన్స్ అందజేశారు.

**కుముదవల్లి, యనమదుర్రులోనూ సేవలు**

డాక్టర్ బి.వి.రాజు స్వగ్రామమైన కుముదవల్లిలోని గ్రామ కేంద్రంలో 500 మందికి యాపిల్స్, బిస్కెట్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. యనమదుర్రు గ్రామంలో మరో 100 మందికి యాపిల్స్, బన్స్, బిస్కెట్లు అందజేశారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మరో వెయ్యి మందికి యాపిల్స్, బిస్కెట్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. విద్య, వైద్య సహాయం, పేదలకు నిత్యావసరాల పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా డాక్టర్ బి.వి.రాజు ఆశయాలను కొనసాగించే దిశగా ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

## కాంగ్రెస్ అధికారంలో కొస్తేనే రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుంది : ఎన్. రఘువీరారెడ్డి



**భీమవరం, అక్టోబర్ 15 : ప్రభాతవార్త** రాష్ట్ర ప్రజలకు మేలు జరుగాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా కాంగ్రెస్ అధికారంలో కి వస్తేనే సాధ్యమని మాజీ మంత్రి ఏఐసీసీ కార్య వర్గ సభ్యులు ఎన్ రఘువీరా రెడ్డి అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో గురువారం ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విభజన చట్టంలోని అంశాలు, పార్లమెంటులో ఇచ్చిన చట్టబద్ధమైన హామీలు, అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజలకు తీవ్ర ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని కూటమి పార్టీలు తమ స్వార్థ రాజకీయాల కోసం, కేంద్రంలోని బీజేపీ పెద్దల అండ కోసమే వెంపర్లాడుతు న్నాయని విమర్శించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసిన ఈ ప్రాంతీయ పార్టీల పాలనతో ప్రజలు తీవ్రంగా విసిగిపోయారని అన్నారు. ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న లోపాలు, ఓట్ల అవకతవకలపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో నిరంతర పోరాటం చేస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నిక లను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టా త్మకంగా తీసుకుంటోందని, పార్టీ నాయకులు, కార్యకర్త లు ఓటర్ల వద్దకు వెళ్లి వాస్తవాలను వివరించా లని, ప్రజాస్వా మ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చా రు. ఈ కార్య క్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అంకెం సీతారాం, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, స్టేట్ ఫార్మ్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మాజీ చైర్మన్ కె.బి.ఆర్. నాయుడు, నూతనంగా నియమితులైన జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మేడ సురేష్ మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.